క్లుప్తంగా

14న మండల పరిషత్ సమావేశం

మేడికొండూరు: మండల పరిదిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14 మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రభాకరరావు శనివారం తెలిపారు. ఎంపీపీ మన్నవస్వప్న అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

ద్విచక్ర వాహనం చోరీ

మంగళగిరి: పట్టణంలోని కొత్తపేటలో ద్విచక్ర వాహనం చోరీకి గురైన ఘటన చోటు చేసుకుంది. శనివారం బాధితుడు నాసిర్ తెలిపిన వివరాల.. శుక్రవారం రాత్రి తన బైక్‌ని కొత్తపేటలోని తన నివాసం వద్ద పార్కు చేసి శనివారం తెల్లవారుజామున లేచి చూడగా ద్విచక్రవాహనం చోరీకి గురయిందని తెలుసుకుని పట్టణ పోలీసులుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పల్లెకు పోదాం యాత్ర

మంగళగిరి: బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నగరంలో పల్లెకు పోదాం యాత్ర నిర్వహించారు. పల్లెలకు వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ప్రధాని నరేంద్రమోదీ చేసిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, తుల్లిమిల్లి రామకృష్ణ, అమ్మయ్య చౌదరి, యశ్వంత్, పెట్టా శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

వరగాని గ్రామంలో...

మేడికొండూరు: మండల పరిధిలోని వరగాని గ్రామంలో శనివారం బీజేపీ రాష్ట్ర మైనార్టీ కార్యవర్గ సభ్యుడు షేక్ బాషా ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పోగు లక్ష్మయ్య, చాగంటి వెంకటప్పారెడ్డి, కె.ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

మంగళగిరి: యువత సేవా దృక్పథాన్ని అలవర్చడమే లక్ష్యంగా రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ వీజే కళాశాల మంగళగిరి ఏర్పాటు చేసినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు తెలిపారు. శనివారం పట్టణంలోని వీజే కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులతో రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ప్రతినిధులు అన్నే రత్నప్రభాకర్, ఎంవీఆర్ మోహన్, షావుకారి నికిత, కాటూరి శ్యామ్, అనిల్ చక్రవర్తి, గాజుల శ్రీనివాసరావు, ప్రగడ రాజశేఖర్, డాక్టర్ వంశీకృష్ణ, అందె మురళి పాల్గొన్నారు.

సీసీఎల్ చొరవతో ప్రజలకు మేలు

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు
ఫుట్‌బ్రిడ్జిని ప్రారంభించిన కంపెనీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్



ఫుట్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ (సీసీఎల్ ప్రాడక్ట్స్) యాజమాన్యం ప్రజలకు అందించిన సహకారం మరువలేనిదని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. దుగ్గిరాల గ్రామ పరిధిలోని బకింగ్‌హామ్ కెనాల్‌కు అనుసంధానంగా ఉన్న కొమ్మూరు కాలువపై నిర్మించిన ఫుట్‌బ్రిడ్జిని కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ దుగ్గిరాల గ్రామంలోని గాంధీనగర్, ఎస్సీ కాలనీ, పెనుమూలి గ్రామాలకు చెందిన వారు దుగ్గిరాల మండల ప్రజాపరిషత్ కార్యాలయం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే రెండు కిలో మీటర్లు తిరిగి రావాల్సి వస్తోందని, ఎమ్మెల్యే ఆర్కే చొరవతో కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్ ఫ్యాక్టరీ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్, ఫుట్‌బ్రిడ్జి నిర్మించేందుకు ముందుకు వచ్చినట్లు చెప్పారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ.70 లక్షలు అయిందని చెప్పారు. వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గంజి చిరంజీవి మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా బ్రిడ్జి నిర్మించడం అభినందనీయమని చెప్పారు. అనంతరం చల్లా రాజేంద్రప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. దుగ్గిరాల అభివృద్ధికి మరింత కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి బాణావత్ కుషీబాయి, వెంకటేశ్వరరావు దంపతులు, దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, సర్పంచులు ఇత్తడి రమేష్, పలుకూరి మేరమ్మ, దుగ్గిరాల ఎంపీటీసీ ద్వాలి బాయి, మోరంపూడి ఎంపీటీసీ కూచిపూడి సురేష్, బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు దాసరి వీరయ్య పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉత్తమ ఫలితాలు



విద్యార్థులకు మార్కుల జాబితా అందజేస్తున్న హెచ్‌ఎం సిస్టర్ నిర్మలామేరి

ఫిరంగిపురం: క్రమశిక్షణతోనే ఉత్తమఫలితాలు పొందవచ్చని హెచ్‌ఎం సిస్టర్ నిర్మలామేరి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్‌ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం సిస్టర్ నిర్మలామేరి మాట్లాడుతూ విద్యార్థులను పాఠశాల వదిలిన తరువాత ఇళ్లవద్దకూడా తల్లిదండ్రులు వారు ఏమిచదువుతున్నారో, ఏమిరాస్తున్నారో అడిగి తెలుసుకోవాలని చెప్పారు. ఇంటివద్ద కొద్దిసేపు అయినా చదువుకునేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థుల మార్కుల జాబితాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని ఓ ప్రైవేటు యూనివర్సిటీ విద్యార్థి బిల్డింగ్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై శనివారం చోటుచేసుకుంది. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ అందించిన వివరాలు... పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం ఉప్పలపాడుకు చెందిన పుల్లయ్య రెండో కుమారుడు వంశీ సాయికృష్ణ(21) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తెల్లవారుజామున తను ఉంటున్న 11వ అంతస్తులోని తన గది నుంచి మరో గదికి వెళ్లి ఆ రూమ్‌లోపల వెనుక వైపు ఉన్న బాల్కనీలో నుంచి కిందకు దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున సెక్యూరిటీ గార్డు చూసి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందాడని డాక్టర్లు నిర్ధారించారు. తండ్రి పుల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

శతాధిక వృద్ధురాలికి సన్మానం



మంగళగిరి: నగర పరిధిలోని రామచంద్రాపురంలో శతాధిక వృద్ధురాలిక సన్మానం నిర్వహించారు. కుర్రె నారాయణమ్మను శతాధిక వృద్ధురాలిగా గుర్తించిన ఎన్నికల కమిషన్ అధికారులు శనివారం ఆమెకు సన్మానించారు. గ్రామ పెద్దలు, ప్రజలు నారాయణమ్మ వంద ఏళ్ల పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించి అభినందనలు తెలిపారు.

నేడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే సుచరిత పర్యటన

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత ఆదివారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు శనివారం ఒక ప్రకటనలో తెలిపాయి. మేడికొండూరు మండలం వరగానిలో క్రీస్తు పరిశుద్ధ దేవాలయం ప్రధాన ద్వారం ప్రతిష్ట, ఉదయం 10 గంటలకు తాడికొండ-నిడమర్రు ప్రధాన రహదారి వై జంక్షన్ రావిచెట్టు నుంచి జయభారత్ కాలనీ వరకు రూ.60 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, 10.30 గంటలకు తాడికొండ మండలం పాములపాడులో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాల ప్రారంభోత్సవం, సాయంత్రం తాడికొండ పోలీస్ స్టేషన్ ఎదుట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

170 మద్యం బాటిళ్లు స్వాధీనం

మంగళగిరి: పట్టణ పరిధిలోని పలు చోట్ల నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పోలీసులు శనివారం రాత్రి తెలిపిన వివరాలు.. పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న రుద్రు శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 170 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సమష్టి కృషితో విజయం సాధ్యం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



కంతేరులో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

కంతేరు(తాడికొండ): పార్టీ విజయానికి కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తే విజయం తథ్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తల సమావేశం శనివారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తాడికొండలో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ ఉందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలతో పేదలకు న్యాయం చేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు ప్రతి గ్రామంలో బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు విజయరాజు కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట సర్పంచి బెజ్జం మహేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు గుడిమెట్ల జ్యోతి, మేడికొండూరు జెడ్పీటీసీ కందుల సిద్దయ్య, ఫిరంగిపురం యార్డు చైర్మన్ షేక్ బాజీ, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావు, నాయకులు తాళ్ల శివనాగరాజు, మాజీ యార్డు వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, నిడుముక్కల సర్పంచి మాదాసు రత్నకుమారి, ఎంపీటీసీలు వలపర్ల కల్పన, బోడపాటి సుశీల, పార్టీ గ్రామ అధ్యక్షుడు సదానందరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, డి.చినపాములు, షేక్ నగీనా, వంగా పోలారెడ్డి పాల్గొన్నారు.

బాలయేసు విగ్రహ ప్రతిష్ట

తాడికొండ: మండల కేంద్రమైన తుళ్లూరులో బాలయేసు కాలనీలో బాలయేసు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయేసు ప్రతిమను గ్రామంలో తేరు ఊరేగించారు. తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకతోటి సుచరిత పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16వ తేదీ నిర్వహించనున్న గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పారావు పిలుపునిచ్చారు. దుగ్గిరాలలోని పసుపు మర్చంట్ అసోసియేషన్ హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. రైతు సంఘం దుగ్గిరాల మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసగిస్తోందని, వ్యవసాయం, పరిశ్రమలు, గనులు, విద్యుత్, అటవీ సంపదలను, రవాణా బ్యాంకులు, తదితర సంస్థలన్నింటిని అదానీ అంబానీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. జీఎస్టీ పేరుతో పన్నులు పెంచి ప్రజలపై భారం మోపుతోందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మంగళగిరి నియోజకవర్గ ఏరియా కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు, అధ్యక్షులు బి.అమ్మిరెడ్డి, సిహెచ్.పోతురాజు, కంచర్ల వెంకటేశ్వరరావు, నటరాజ్, రమేష్ బాబు, మౌలాలి పాల్గొన్నారు.

వృద్ధులపై నిర్లక్ష్యం తగదు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రతినిధులు

మంగళగిరి: వృద్ధులను అనాథ ఆశ్రమాలలో చేర్చకుండా అక్కున చేర్చుకునేలా నేటి తరం చిన్నారులు తమ తల్లిదండ్రులకు నచ్చజెప్పాలని రిటైర్డు ఇంజినీర్ రఫిల్లాఖాన్ అన్నారు. శనివారం ఆత్మకూరు జాతీయ రహదారి వెంట కల నిర్మల ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా రఫిల్లా ఖాన్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న పెద్దవారు చిన్నపిల్లలాంటి వారని వారిని దూరంగా పెట్టకుండా సహాయ సహకారాలు అందించాలన్నారు. అమ్మమ్మ, నాయనమ్మ, తాతాయ్యలతో గడిపిన పిల్లలు భవిష్యత్‌లో క్రమశిక్షణతో కూడిన విద్యను అందుకుని ఉన్నతస్థానాలను చేరుకుంటారన్నారు. వారి అనుభవాలు చిన్నతనంలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.జాన్‌పాల్, ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్ఞానసుందరి పాల్గొన్నారు.